# జారిన ఆత్మీయత

రచన : పార్నంది లోకనాథేశ్వరరావ్

నేనా ఇంట్లో దిగిన మర్నాటినుంచీ, ప్రక్కింటాయన ఎంతో ఆత్మీయుడిలా నాతో కలుగచేసికొని. విపరీతమైన చనువుగా ఉండటం ఆరంభించాడు. మా యిళ్లకు మా రెండు ఆఫీసులు సుమారు మైలున్నర. పీడో పెద్దవాడు గదా అని మర్యాదకి నాలుగైదుసార్లు రిక్షాలో కలసివెళ్లి, నేను రిక్షాకు డబ్బిచ్చేవాణ్ణి. ఇంక మర్యాదకి ఎన్నోసార్లు 'టీ' కూడా ఆఫర్‌చేశా. అక్కడినుంచి అదేపనిగా, ప్రొద్దుట మా పనిమనిషి ఫ్లాస్కులో నాకోసం టీ తెచ్చిసర్కి, ప్రక్కింటాయన, ఎలా పసిగట్టేవాడో తయార్. చూస్తూ ఎలా త్రాగేయటం. నాకున్నదాంట్లో ఆయనకు వంతివ్వక తప్పేదికాదు. చూడండి వరస. నేను హొటల్లో భోంచేస్తూ ఒక్కణ్ణే వున్నాను. తను భార్యాబిడ్డలతో ఉన్నాడు. ఇలా నాకు ఆముదం వ్రాయటమేగాని ఓనాడేనా తనింటికి పిలచి ఓ టీ కప్పు యిచ్చిన పాపాన పోలేదు.

సరే, టీ సంగతి, రిక్షాల సంగతి ఉంచండి. ఇంక సినిమాలా, నే బయలుదేరేటప్పుడల్లా రెడీ. రిక్షాకు, సినిమా టిక్కెట్లడబ్బుకి నాకే ఆముదం. మాటవరసకేనా, 'నేనిస్తా లెండి' అనేనా అనేవాడు కాదు. ఇలా దాచిపెట్టినట్టు టీలకి, ఆఫీసులకి రిక్షాలకి, సినిమాలకీ నాకు బలే ఆముదం పట్టించేవాడు.

ఇంత సభ్యత తెలియని మనిషేమిటా అని నాకోవిధమైన కోపం, అసహ్యం కూడా ముంచుకొచ్చాయి. దేనికైనా ఓ మితి ఉండాలి. వ్రేలు చూపేముగదా అని మండ మింగేయడమే. వీడికి సరియైన డోస్ యివ్వాలని నిశ్చయించుకొన్నా.

ప్రొద్దుటే "మూర్తిగారూ, లక్ష్మీకేఫ్" అన్నానో లేదో, అప్పుడే రెడీ. బాగా 1-2-0 టిఫిన్ చేశాం. నేనే ఆర్డరిచ్చాననుకోండి. నిర్మొహమాటంగా కొట్టేశాడు. అతను టీ త్రాగుతుండగానే, నేను బయటకొచ్చి కిళ్లీ షాపుదగ్గర నిలబడ్డాను. సర్వర్ బిల్లు అతనిముందు పడేశాడు. కిటికీలోంచి రోడ్డుమీదున్న నాకేసి చూస్తున్నాడు. నేనటు చూస్తే గదూ. విధిలేక బిల్లు చెల్లించి నాప్రక్కకొచ్చాడు వెధవమొహం వేసుకొని. అప్పటికి నేను, కిళ్లీ బనాయించి సిగరెట్ కాలుస్తున్నాను. నావైపు చూస్తున్నాడు కిళ్లీకోసం గామోసు. కంటి చూపేగాని నోట మాటలేదు పోదాంసార్ అన్నా. అలాగేనోయ్ అంటూ బరువుగా అడుగు లేశాడు. ఆత్మీయత సగపాలు జారింది. దినాలు దొర్లుతున్నాయ్. టీ వేళకి రావడం బంద్.

అనా డాదివారం. మూర్తి గారు "విజయాకి" వెళ్దామా. ఎక్సలెంట్ పిక్చర్‌అన్నా. ఏదో నసిగి 'ఎస్'అన్నాడు. రిక్షా 0-12-0 కి మాట్లాడాను. హాలు చేరుకొన్నాం. రిక్షా దిగి ఠంచన్‌గా నుంచున్నాడు. నేనూ, మారు మాట్లాడకుండా హాలువైపుచూస్తూ, రికార్డులు వింటున్నా. రిక్షావాడి తొందర. ఏం చేస్తాడు? జేబులోంచి లక్షణంగా డబ్బు తీసి రిక్షావాడికిచ్చాడు ఆత్మీయుడు. ఇంక టిక్కెట్లు. ఇద్దరం విసురుగా బుకింగ్ ఆఫీసువద్దకు వెళ్లాం. అక్కడా దాచిపెట్టినట్టు నా మొహంకేసి చూస్తున్నాడు. నేను గోడమీద పోస్టర్లు చూస్తున్నా. ఇంక ఆట మొదలుపెట్టే టైమయినట్టుంది అన్నాడు వెధవమొహంపెట్టి. నాకు అరికాలుమంట తలకెక్కింది. టయిమయితే రెండు ఫస్టుక్లాసు తీయండి సార్ అన్నా. నూనె కారిపోతున్న మొహంతో ఎలాగైతే నేం టిక్కెట్లు సాహసించి కొన్నాడు. ఇన్‌ట్రవెల్ అయింది. "మూర్తిగారూ, టీ తీసుకొందామా" అన్నా. అబ్బే నాట్ నెససరీ అన్నాడు. సంకటం కుదిరిందా అనుకొన్నా. అపుడే ప్రక్కనుంచి వెళ్తున్న టీ కుర్రాణ్ణి పిలచి ఓ కప్పు టీ త్రాగాను. ఆత్మీయుడు అలా వెర్రి మొహంవేసుకు చూస్తున్నాడు. ఆట విడిచారు రోడ్డుమీదికొచ్చి రిక్షాఎక్కాను. చల్లగా ఉంది, నడచిపోదాం అన్నాడు. మబ్బులు కమ్మాయి. ఎక్కండి సార్ రెండుమైళ్ళు ఎక్కడ నడుస్తాం అన్నా. రిక్షాలో రెడీ. మా కాంపౌండ్‌ముందు రిక్షా ఆగడమేమిటి; ఒకే గంతులో నా రూమ్ చేరా. ఆత్మీయుడు రిక్షావాడికి డబ్బియ్యక తప్పలేదు.

ఆ మర్నాటినుంచీ ఆత్మీయత పూర్తిగా జారిపోయింది. హలో అంటే హలో. అంతే!

'టీ' కి వస్తే ఒట్టు!

ఆఫీసుకి పోదామా రిక్షాలో; అంటే అబ్బే ఎందుకండీ అనేమాట పెగిలింది !!

సినిమావో ... నాతో రావడమంటేనే హడల్ !!! థాంక్స్ గుడ్ అనుకొని సంతోషించా !

ఇలాటి బాపతులు ఉన్నాయంటారా ...లేవంటారా...గప్‌చిప్. ★